
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 13 నవంబరు 2024


## దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న డే-వాచ్‌మన్ పోస్టు భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్వేతారెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి పదో తరగతి పాసై, వాచ్‌మన్‌గా పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.9,750 వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9100439368 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని శ్వేతారెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

## గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే పరీక్షలపై కలెక్టరేట్‌లో మంగళవారం పోలీస్, నోడల్, వివిధశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుంచి 9.30వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారని చెప్పారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేస్తారని, ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించబోరని తెలిపారు. పోలీస్, నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ గ్రూప్-3 పరీక్ష జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు రాస్తున్నారని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, నోడల్ అధికారులు చేయాల్సిన పనులపై ఆమె వివరించారు. పోలీస్ నోడల్ అధికారి, ఏసీపీ కరుణాకర్ రావు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి రామారావు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర నోడల్ అధికారులు, డిపార్టుమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలపై కొరడా

» 10 భవనాల కూల్చివేత

ఆదిభట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో మున్సిపాలిటీ నుండి తీసుకున్న అనుమతుల ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టిన 10 భవనాలను గుర్తించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జేసీబీల సహాయంతో మంగళవారం వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. వాటిని అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూల్చివేస్తామని హెచ్చరించారు.



తాండూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు, సిబ్బంది

# నిరసన జ్వాల

## లగచర్ల ఘటనపై భగ్గుమన్న ఉద్యోగులు

ఫార్మా కారిడార్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణకు దుద్యాల మండలం లగచర్లకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌లపై దాడిని నిరసిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల ఉద్యోగులు విధులు బహిష్కరించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఈ ఘటనకు పాల్పడిన వారిపైన, వారిని పురికొల్పిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై దాడులను ముక్తకంఠంతో ఖండించారు. ఈ ఘటనను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

- నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు
- కార్యాలయాలకు తాళం వేసి విధుల బహిష్కరణ
- అధికారులకు భద్రత కల్పించాలని డిమాండ్
- నిందితులపై కఠిన చర్యలకు పట్టు

6



మహేశ్వరం మండల పరిషత్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తాండూరు/పెద్దేముల్/బషీరాబాద్/మహేశ్వరం/పరిగి/ఇబ్రహీంపట్నం/మేడ్చల్ ప్రతినిధి/యాలాల/ పూడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులకు కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ మద్దతిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీఎంసీ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దేముల్ మండలపరిషత్ కార్యాలయంలో సిబ్బంది భోజన విరామంలో నిరసన తెలిపారు. ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు,

మిగతా 7వ పేజీలో...

జిల్లాలో నేడు

## ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దామాషా ప్రకారం స్థానిక సంస్థల కల్పించే రిజర్వేషన్లపై బుధవారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి. సైదులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమిషన్‌కు అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చన్నారు. స్థానిక సంస్థలకు అవసరమైన రిజర్వేషన్లను దామాషా ప్రకారం కల్పించేందుకు సలహాలు, అభ్యర్థనలు, ఆక్షేపణలను కమిషన్‌కు సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలతో సమర్పించవచ్చని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.

## ముడిమ్యాల్‌కు మంత్రుల రాక

చేవెళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామానికి బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. ముడిమ్యాల్ నుంచి రావులపల్లి మీదుగా మేడిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.





పల్లెలకు

# ‘బెల్టు’ కిక్కు

## గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

- రాత్రి 10 గంటలు దాటితే ఒక్కో వైన్ బాటిల్‌పై రూ. 50 అదనంగా వసూలు
- ఎనీటైం మందు(ఏటీఎం)లా బెల్టుషాపుల నిర్వహణ
- వాడవాడలా కిరాణ షాపుల్లో జోరుగా విక్రయాలు
- వ్యాపారులు, బెల్టు నిర్వాహకుల కుమ్మక్కు!.. ప్రభుత్వ ఆశయాలకు తూట్లు

నందిగామ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లు వెచ్చించి వేలంలో వైన్‌షాపులు దక్కించుకున్నవారు అనుకున్న స్థాయిలో వ్యాపారాలు లేవన్న సాకుతో పల్లెల్లో బెల్టుషాపులకు తెరతీశారు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చెప్పినా పల్లెల్లో మాత్రం మద్యం ఏరులై పారుతోంది. వాడవాడలా మద్యం విక్రయాలు జోరుగా జరుగుతూనే ఉన్నాయి. గ్రామాల్లోని ప్రతీ కిరాణషాపులో దర్జాగా ఎక్సైజ్, పోలీస్‌శాఖల అండదండలతో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. రాత్రి 10 గంటలు దాటితే చాలు ఒక్కో వైన్ బాటిల్‌పై అదనంగా రూ.50 చెల్లించాల్సిందే. ప్రధానంగా మద్యం వ్యాపారులు, బెల్టుషాపుల నిర్వాహకులు కుమ్మక్కై ఈ వ్యాపారాన్ని మూడు పూలు ఆరుకాయలుగా సాగిస్తున్నారనే విమర్శలున్నాయి. మద్యంషాపు యజమానులు బెల్టుషాపుల నిర్వాహకులకు వైన్‌బాటిళ్లను ఎమ్మార్పీ ధర కన్నా అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు దండుకుంటుండగా.. మందుబాబులకు బెల్టుషాపుల నిర్వహణదారులు ఇష్టారీతిన మద్యం విక్రయిస్తూ

మిగతా 8వ పేజీలో...





దీక్షలో జేఏసీ నాయకులు

## మండల సాధన పోరాటం ఉధృతం

తలకొండపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామస్థులు మండల కేంద్రం ఏర్పాటు కోసం పోరాటం ఉధృతం చేశారు. చుట్టుపక్కల గ్రామాలు, తండాల వాసులతో కలిసి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 12వ రోజుకు చేరాయి. మహిళలు, జేఏసీ నాయకులు , యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్,మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్సుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీ తండా లను కలిపి గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ అశోక్ గౌడ్, కో-కన్వీనర్ శరత్‌చంద్ర, జేఏసీ నాయకులు అంజనేయులు, బాల్‌జంగయ్య, అనిల్, నర్సింహగౌడ్, లక్ష్మయ్య, శ్రీను, రాజు,చంద్రయ్య, యాదమ్మ, జంగమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నష్టపరిచే నిర్ణయాలకు

# మేం వ్యతిరేకం

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి తాము అడ్డు కాదని, రైతులకు నష్టం కలిగించే ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకే తాము ఎల్లప్పుడూ వ్యతిరేకం అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం అగర్‌మియాగూడలో లేమూరు, అగర్‌మియాగూడ రైతులు ఏర్పాటు చేసిన భూనిర్వాసితుల సభకు ఆమె హాజరై మాట్లాడారు. ఫోర్త్ సిటీకి రోడ్డు వేసేందుకు రైతులతో చర్చించకుండానే ప్రభుత్వం నేరుగా పాం(ఏ) ద్వారా పత్రిక ప్రకటలివ్వడం ఏమిటని ప్రశ్నించారు. రాత్రికిరాత్రి డ్రోన్ సర్వే చేసి ఒక సర్వే నంబర్‌లో ఎకరం భూమి తీసుకోవాల్సి వస్తే సదరు సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం భూమికి ఈ ప్రభుత్వం అవార్డు ప్రకటించడం సరికాదన్నారు. గతంలో కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మాసిటీకి చేసిన భూసేకరణలో ప్రతీ ఎకరానికి 121గజాల చొప్పున ప్లాట్లు ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వం ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 నుంచి ఫోర్త్ సిటీ వరకు చేస్తున్న భూసేకరణలో రైతులు భారీగా నష్టపోతారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి భూసేకరణ చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసమే ఈ రోడ్డు వేసేందుకు కుట్రపన్నారని ఆరోపించారు. గతంలో సేకరించిన భూముల్లో ఫార్మా సిటీకి ఏర్పాటు చేస్తున్నారా? లేదా? అనేది సీఎం స్పష్టం చేయాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చి నేటికీ ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే భూమికి భూమి ఇచ్చే వరకు ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు ఇవ్వం అని అగర్‌మియాగూడ, లేమూరు రైతులన్నారు. 18.5కిలోమీటర్ల ఫోర్‌లేన్ రోడ్డుకు 19మంది రైతుల 441.34ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగర్‌మియాగూడ రైతు ద్యాసాని సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లేమూరులో 563, 564, 566, 567 సర్వే నంబర్లలో తనకు 3ఎకరాలు ఉందని, దీనిలో రెండెకరాల తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని వాపోయాడు. ఇక్కడ ఎకరం రూ.5కోట్లు ఉందన్నాడు. అగర్‌మియాగూడకే చెందిన శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రైతులు బిచ్చం అడుక్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, వైఎస్‌చైర్మన్ విజయేందర్‌రెడ్డి, నాయకులు, రైతులు ఆనంద్, భూపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణ, కాకి దశరథ, శ్రీహరి, కాకి రాములు, తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణకు వేసిన గుర్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రం

## ప్రారంభం

తలకొండపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సింగిల్ విండో డైరెక్టర్ మహ్మద్ నయిమొద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు.

# జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

» దిశ చైర్మన్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులంతా కలిసి పని చేసి వికారాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో దిశ సమావేశాన్ని విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దిశ వైస్ చైర్‌పర్సన్ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, చేవెళ్ల, తాండూర్ ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌లతో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పని చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు ఇస్తోందని, ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకోసారి సమీక్షించుకోవాలన్నారు. పాఠశాలల్లో సదుపాయాలు, స్వచ్ఛభారత్ బాత్‌రూమ్‌ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి 100కోట్లు మంజూరు చేశామన్నారు. లక్ష్యాల మేరకు రుణాలివ్వాలని బ్యాంకర్లకు సూచించారు. పనిచేయని బోర్లను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలన్నింటికీ భవనాలు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, చిన్నారులకు బాలామృతం తప్పక ఇవ్వాలని చెప్పారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఉపాధి హామీ, విద్యుత్, మిషన్ భగీరథ, హైవేలు, భూగర్భ జలాల అంశాలపై సమీక్షించారు. డీఆర్డీవో శ్రీనివాస్, పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, నామినేటెడ్ సభ్యులు వడ్ల నందు, రాజశేఖర్, జానకిరామ్, లలిత, మునిసిపల్ కమిషనర్లు జకీర్ అహ్మద్, వెంకటయ్య, విక్రమసింహారెడ్డి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా రుద్రాభిషేకం

కీసరగుట్ట మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర స్వామికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు నిత్య సేవల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయప్రాకార మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

కీసర, నవంబరు12(ఆంధ్రజ్యోతి)

# గోశాలకు పశుగ్రాసం వితరణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీకృష్ణ గోశాలకు స్థానిక స్టీల్, సిమెంట్ డీలర్ ఉప్పల శివకుమార్ ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. షాద్‌నగర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల శివకుమార్‌ను వాసవి క్లబ్ నాయకులు గుడుపల్లి వెంకటరమణ, ఎంవీఎస్ సురేష్, కల్వ మాణిక్యం, దండు వాసు, కొండ రమాదేవి, కల్వ పుష్పలత, పి.స్వప్నలు అభినందించారు. పశువులకు మేతను సమకూర్చడం సంతోషకరంగా ఉందన్నారు.





తాండూరులో సర్వేను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రవికుమార్ (ఫైల్)

# వివరాలు చెప్పేందుకు వెనకడుగు

- ఎన్యూమరేటర్లకు భూములు, ఆస్తుల లెక్కలివ్వని ప్రజలు
- బ్యాంక్ ఖాతా నంబర్లు ఇచ్చేందుకూ జనం భయం
- సమగ్ర కుటుంబ సర్వే తీరూతెన్నిది!

తాండూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ, కుల గణన సర్వేపై చర్చ కొనసాగుతోంది. ఏ నలుగురు కలిసినా మీ ఇంటికి సర్వే ఎన్యూమరేటర్లు వచ్చారా? ఏమేం వివరాలు చెప్పారు? అడిగినవన్నీ చెప్పారా? అని మాట్లాడుకుంటున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లకు బ్యాంక్ ఖాతా, ఆధార్ నంబర్లు ఇవ్వడం లేదు. మా భూములు, ఆస్తుల వివరాలు మీకెందుకు అని తేల్చి చెబుతున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన కుల గణన సర్వేపై ప్రజలకింకా స్పష్టత రాలేదు. ఆస్తులు, వాహనాల వివరాలు చెబితే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయేమోనని, వచ్చేవి రావని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిరు వ్యాపారులు బ్యాంక్ ఖాతా నంబర్లు చెప్పం అంటున్నారు. ఈ సర్వే ఫలితాలు ఎలా ఉంటాయోనని ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఈ సర్వే ఈ నెల 18 వరకు కొనసాగనుంది. తాండూరు సబ్‌డివిజన్‌లో 71వేల పైచిలుకు ఇండ్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు సర్వేను నిత్యం పర్యవేక్షిస్తూ ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేస్తున్నారు. మూడు రోజుల్లో మంగళవారం వరకు 15శాతం వరకు ఇండ్లలో సర్వే చేశారు. జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, వైకల్యం శాతం వంటి వివరాలు చెబితే చాలని, జిరాక్స్ కాపీలు అవసరం లేదని అధికారులు ప్రజలకు తెలియజేస్తున్నారు. అలాగే ప్రతీ కుటుంబం సర్వే వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందని పేర్కొంటున్నారు.

# దిశ సభ్యుడిగా వడ్ల నందు



వికారాబాద్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యుడిగా వికారాబాద్ బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందుకు అవకాశం దక్కింది. ఆయనతో పాటు మా శారద ఆసుపత్రి డాక్టర్ రాజశేఖర్, కుల్కచర్ల వాసి జానకి రామ్, తాండూరుకు చెందిన అనంతలక్ష్మిలను సభ్యులుగా నియమించారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తాం



బహుమతులు అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్, ఎంపికల కార్యక్రమం మంగళవారం ముగిసింది. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, పెద్దేముల్, మోమిన్‌పేట్, కొడంగల్ జోన్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. చివరగా ఫైనల్‌లో తాండూరు, కొడంగల్ జట్లు తలపడగా కొడంగల్ జట్టు విజయం సాధించింది. విజేతలకు చైర్మన్ చేతుల మీదుగా షీల్డ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నర్సింహులు, గోపాల్, మధు, నాయకులు మల్లేశ్, తాహేర్‌అలీ పాల్గొన్నారు.

# బషీరాబాద్ మండల వ్యవసాయాధికారిగా అనిత



బషీరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా ఎస్.అనిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడా ఏవోగా పని చేసిన సూర్యప్రకాష్ ధారూర్ మండలానికి బదిలీఅయ్యారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన అనిత ఇటీవల కొత్తగా ఉద్యోగంలో చేరగా ఏవోగా ప్రభుత్వం ఇక్కడా నియమించింది. రైతులకు అందుబాటులో ఎంటూ సేవలందిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



బండవెల్కిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల, పుట్టపహాడ్ గ్రామాల్లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో బక్కారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీ నగర్‌కు చెందిన సాయికుమార్, ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డికి రూ.60వేల చొప్పున మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సునిల్‌కుమార్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చివరి ధాన్యపు గింజ వరకూ కొంటాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి చివరి వడ్ల గింజ వరకూ కొంటామని, కొన్న వారం రోజుల్లో డబ్బు జమ చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య అన్నారు. మంగళవారం మంతన్‌గౌరెల్లి, యాచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గతంలో సన్న రకం ధాన్యం కొనక రైతులు ఆందోళన చెందారని, ఈ సారి సన్నరకం ధాన్యం కూడా కొని రైతులకు క్వింటాలుపై అదనంగా బోనస్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో రవినాథ్, కె.జోగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న డీఏవో నర్సింహారావు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.నర్సింహారావు అన్నారు. రైతునేస్తంలో భాగంగా మంగళవారం కొత్తగూడ(కందుకూరు రైతు వేదిక)లో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పంట వేసే ముందే లోతైన దుక్కులు చేసుకోవాలన్నారు. పంటలపై చీడ పురుగులు ఆశించకుండా తరచూ మోతాదు మేరకు రసాయన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో కృష్ణమోహన్, ఏఈవోలు రాజు, జగదీశ్వర్, రాఘవేందర్, శ్రీహరి, నర్మద, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అనంతుడిని దర్శించుకున్న ఎంపీ



ఆలయ ప్రాంగణంలోని చెట్టుకు ముడుపు చెల్లిస్తున్న ఎంపీ అరుణ

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతగిరిలో కార్తీక మాస పెద్ద జాతర ఘనంగా జరుగుతుండగా మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీతో అర్చకులు పూజలు చేయించి అనంతరం సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న చెట్టుకు ఎంపీ అరుణ ముడుపు చెల్లించారు. అనంతరం ఆలయ పరిరక్షణ సమితి భజన కార్యక్రమాల్లో పాల్గొని కళాకారులను అభినందించారు. రెండో రోజు అనంతగిరి జాతరలో తిరుమల శ్రీనివాసుడి సేవల మాదిరిగా మహిళలు స్వామి సేవలో పాల్గొన్నారు. ధారూర్ మండల మహిళలు భక్తులకు సేవ చేశారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, లేడీ వింగ్ ప్రెసిడెంట్ యాష్మి, శిరీష, సుచరితారెడ్డి తదితరులున్నారు.

## ఐసీఎల్ కర్మాగార కాలుష్యంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రైతులు

తాండూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులోని ఇండియా సిమెంట్ కర్మాగారం కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. దీంతో గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఇండియా సిమెంట్ కర్మాగార ప్రతినిధులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డి, మాజీ ఘని కార్మిక సంఘం డైరెక్టర్ ఉల్లి నర్సింహులుతో పాటు మరికొంత మంది రైతులు కర్మాగారం సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. పంట పొలాలపైకి కాలుష్య కారకాలు రాకుండా నియంత్రించాలని కోరారు. కాలుష్యంతో పంటలు పడటం లేదని ఈ విషయంపై కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వారి పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తున్నారని, ఉన్నత చదువులు చదివి ఆదర్శంగా నిలవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు సూచించారు. మంగళవారం కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసినకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఉపాధ్యాయులు ఇష్టంతో బోధిస్తున్న విషయం మరవొద్దన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదిగితే మొదట సంబరపడేది ఉపాధ్యాయులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సై తేజంరెడ్డి, హెచ్‌ఎం పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు



షాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులపై సూపర్‌వైజర్లు ఒత్తిడి చేసి, ఇబ్బందులు పెడుతున్నారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో అపర్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు ఇప్పటికే ప్రజల వివరాలు సేకరించేందుకు తిప్పలు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్వే నిబంధనలు అంటూ వివిధ రకాలుగా సూపర్‌వైజర్లు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు చెప్పి మధ్యాహ్నం నుంచి సర్వే చేస్తున్నారు. అలాంటి వారిపై ఒత్తిడి సరికాదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవిడ్‌రెడ్డి, కృష్ణ, టీచర్లు నర్సింహులు, రాంచందర్, వెంకటరమణ, పాషా తదితరులు ఉన్నారు.

# స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై చర్యలేవి?



- మేడ్చల్ డీఈవో తీరుపై టీచర్ల విమర్శలు
- ధర్నాలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ సంఘాలు



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యా శాఖలో 2024 జూన్‌లో జరిగిన టీచర్ల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని ఉపాధ్యాయసంఘాలు పేర్కొంటున్నాయి. అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు డీఈఓ తాత్సారం చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఈ విషయమై డీఈఓకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇందులో ఆంతర్యమేమిటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విచారణలో తేలిన తర్వాతా నాలుగు నెలలుగా డీఈఓ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాల డీఈఓలు చర్యలు తీసుకున్నా మేడ్చల్ డీఈఓ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో ప్రభుత్వం స్పౌజ్ బదిలీలకు అనుమతినిచ్చింది. ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లు పెట్టుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా ఉపాధ్యాయులు అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు పెట్టుకున్నారు. భార్య/భర్త ఉన్న పాఠశాలకు లేదా సమీపంలోని మరేదైనా పాఠశాలకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. అయితే కొందరు టీచర్లు తమ నివాసప్రాంతాల సమీప పాఠశాలలకు, హెచ్‌ఆర్‌ఏ ఎక్కువొచ్చే ప్రాంతంలోని పాఠశాలలకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. దీంతో తమకు నచ్చిన పాఠశాలలకు బదిలీ చేయించుకున్నారు. దీనిపై విద్యాశాఖ అప్రమత్తమై జిల్లాలో 11 మంది ఉపాధ్యాయులపై ఎంఈఓలతో కమిటీ వేసి విచారణ చేయించింది. ఎంక్వైరీ రిపోర్టును డీఈవోకు అందజేశారు. రిపోర్టు ఆధారంగా సదరు ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్న డీఈవోపై ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు స్పౌజ్‌లపై ఇతర జిల్లాల్లో సస్పెన్షన్ చర్యలు తీసుకోగా మేడ్చల్ జిల్లాలో మాత్రం చర్యలేం తీసుకోవడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే తప్పుడు స్పౌజ్‌లపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం డీఈఓలకే అధికారం ఇచ్చింది.

### జేఏసీ ఆధ్వర్యంలో 21న ధర్నా

స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 21న జేఏసీగా అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి ధర్నా చేస్తాయని సంఘాల నాయకులు తెలిపారు. బదిలీల కౌన్సిలింగ్ నాటికి జిల్లాలో స్పౌజ్ పనిచేయనప్పటికీ ఎడిట్ ఆప్షన్ ఇచ్చినా మార్చుకోకుండా స్పౌజ్ పాయింట్లను వాడుకోవడం నిబంధనలకు వ్యతిరేకం అన్నారు. అర్హులైన టీచర్లకు అన్యాయం జరిగిందన్నారు. దీన్ని సరిచేయాలని మంగళవారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విచారణలో ఉపాధ్యాయులు తప్పు చేసినట్లు తేలినా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందునే జేఏసీగా ఏర్పడి ఈ నెల 21న ధర్నాకు పిలుపునిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీయూటీఎస్, టీపీయూఎస్, టీయూటీఎఫ్, టీపీఆర్‌టీయూ, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు తెలిపారు.

# గౌడ కులస్తుల సంక్షేమానికి తోడ్పాటు



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న పాలకుర్ల రాములు, గీత కార్మికులు, నాయకులు

కల్వకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ): గీత వృత్తి రక్షణ, గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తాటి, ఈత, కర్జూర వనాల పెంపునకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మంగళవారం కడ్తాల్ మండలం చరికొండ, ముద్విన్, ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామాల గీత కార్మికులు, గౌడ కులస్థులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కసిరెడ్డి మాట్లాడుతూ కల్లును కల్తీచేసి ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని, కఠిన చర్యలు తప్పవని తెలిపారు. విక్రయదారులు ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. అర్హులైన గీత కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు ఇళ్లులేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గతంలో లైసెన్స్‌లు లేని కార్మికులకు తాను చొరవ తీసుకొని లైసెన్స్‌లు ఇప్పించడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ గౌడ కులస్థులకు రాజకీయంగా కూడా తగిన అవకాశాలు కల్పిస్తుందని, పదవుల్లో పెద్దపీట వేస్తుందని చెప్పారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, గౌడ సంఘం జిల్లా నాయకులు పాలకుర్ల రాములుగౌడ్, లాల్‌కోట నర్సింహ్మగౌడ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శేఖర్‌గౌడ్, గూడూరు భాస్కర్‌రెడ్డి, మాలే మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, మోత్యనాయక్, పోటేళ్ల యాదయ్య, వెంకటయ్య, యాదయ్య, సుమన్, జంగయ్య, అంజయ్య, జహంగీర్‌బాబా, జహంగీర్ అలీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు వస్త్ర వ్యాపారి విరాళం



షాద్‌నగర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వస్త్ర వ్యాపారి విరాళం అందించారు. పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో ఉన్న సీఎంఆర్ బట్టల దుకాణం యజమాని వెంకటరమణ తమ వంతుగా రూ.1.50 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు షాద్‌నగర్ సంస్థ మేనేజర్ సుధాకర్, కృష్ణకుమార్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సీఐకి చెక్కును అందించారు. సీఎంఆర్ సంస్థకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



పోమాల్‌పల్లిలో ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ నరహరి

కేశంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గుళ్లు, గోపునాలు వంటి ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కేశంపేట సీఐ నరహరి సూచించారు. కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, పాపిరెడ్డిగూడ, వేముల్‌నర్వ, సంగెం గ్రామాల్లోని ఆలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆలయాలపై దుండగుల దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆలయాల వద్ద రక్షణ, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు పోలీసు విచారణలో సీసీ ఫుటేజీల పాత్ర పెరిగిపోయిందని, నేర పరిశోధనల్లోనూ సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎన్నో కేసుల్లో కెమెరాల సాయంతో నేరస్థులను పట్టుకొని జైళ్లకు పంపిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మురళీధర్, రమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.



మెథడిస్టు జాతరను ప్రారంభిస్తున్న బిషప్ డానియెల్ దంపతులు



ఏసు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న బిషప్ దంపతులు

# మెథడిస్టు జాతర ప్రారంభం

ధారూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధారూరు క్రిస్టియన్ మెథడిస్టు జాతర మంగళవారం ప్రారంభమైంది. దోర్నాల్, ధారూరు స్టేషన్ గ్రామాల మధ్య కాగ్నా ఉపనది పక్కన ఈ నెల 17వ తేదీ వరకు జాతర కొనసాగుతుంది. ప్రధాన ద్వారం వద్ద బిషప్ ఎం.ఏ.డానియెల్ దంపతులు రిబ్బన్ కట్‌చేసి జాతరను ప్రారంభించారు. ఏసు శిలువ వద్ద బిషప్ దంపతులు ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించారు. బిషప్ దంపతులకు జాతర కమిటీ ఘన స్వాగతం పలికింది. బిషప్ డానియెల్ భక్తులకు క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు. ప్రభువు ఆశీర్వాదంతో ప్రజలంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జాతర కమిటీ మెంబర్లు దయానంద్, స్టీవెన్, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

### భక్తులు అడవిలోకి ప్రవేశించొద్దు : రేంజర్

మెథడిస్టు జాతర ప్రాంగణం చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతంలోకి భక్తులు ప్రవేశించొద్దని ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ తెలిపారు. భక్తులు వంటకు అడవిలో చెట్లు నరికి కలప, పొరక తీసుకుపోవద్దన్నారు. అటవీ ప్రాంతంలో మద్యపానం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసి కలుషితం చేయొద్దని, అటవీ సంరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజాసేవకు పదవులు దోహదం



డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గుత్తా అమిత్‌రెడ్డిని శంషాబాద్ మున్సిపాలిటీ కొత్వాల్‌గూడకు చెందిన సీనియర్ నాయకులు గుంటి ప్రవీణ్‌కుమార్, పాత్రికేయులు మధు, నాయకుడు మహ్మద్ నజీరుద్దీన్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నజీరుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమిత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమించడం సంతోషకరం అన్నారు. ప్రజాసేవలో యువకులు ఉత్సాహంగా పాల్గొనేందుకు ఇలాంటి పదువులు దోహదపడతాయన్నారు. యువతను గుర్తించి రాజకీయాల్లో ప్రోత్సహించడం అభినందనీయం అని అన్నారు. మరో నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం యువకులకు ప్రభుత్వ రంగ కార్పొరేషన్ చైర్మన్ పదవులను కేటాయించడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా నాయకులు అమిత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## కడా చైర్మన్‌ను పరామర్శించిన సునీతారెడ్డి



కడా చైర్మన్ వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) చైర్మన్ వెంకట్‌రెడ్డికి సోమవారం లగచర్లలో జరిగిన సంఘటనలో గాయాలయ్యాయి. మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. అధికారులపై దాడిని తాము ఖండిస్తున్నామన్నారు.

## ఇంటింటి సర్వేలో 21 రకాల దివ్యాంగులను గుర్తించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న ఇంటింటి సర్వేలో 21 రకాల దివ్యాంగులను గుర్తించాలని వికలాంగుల జాతీయ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. మంగళవారం షాద్‌నగర్ ఆర్డీవో సరితకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌పీఆర్‌డీ డివిజన్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్వేలో పార్ట్1 ఫారం, 13వ కాలంలో మీరు వికలాంగులా? అన్న ప్రశ్న ఉంది. కానీ 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను నిర్ధారించారని తెలిపారు. 13వ కాలంలో వికలాంగుల వివరాలను పొందుపర్చలేదన్నారు. 21 రకాల వైకల్యాలను గుర్తించేలా హ్యాండ్‌బుక్‌ను రూపొందించాలని కోరారు.

## బీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన అశోక్



శ్రీకాంత్‌గౌడ్‌తో అశోక్

కడ్తాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను మంగళవారం ఎస్సీ సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించారు. బీసీల సంక్షేమం, యువత ఉపాధి కల్పనకు కార్పొరేషన్ ద్వారా తోడ్పాటునందించాలని శ్రీకాంత్ గౌడ్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు అశోక్ తెలిపారు.

# నిరసన జ్వాల

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది తమ మద్దతు తెలిపారు. బషీరాబాద్ రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ వై.వెంకటేష్, ఆర్‌ఐ నాగార్జునరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సర్వేయర్ రవి పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో విజయ్‌కుమార్, సిబ్బంది మండల పరిషత్ వద్ద ఆందోళన చేశారు. మహేశ్వరం మండల పరిషత్ వద్ద అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పరిగి మునిసిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కమిషనర్ వెంకటయ్య, నరేష్, దశరథం పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ అనితారెడ్డి, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు కృష్ణ, పుష్పలత పాల్గొన్నారు. లగచర్లలో దాడిని ఖండిస్తూ మేడ్చల్ కలెక్టరేట్ వద్ద అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. యాలాల రెవెన్యూ ఆఫీసుకు తాళం వేసి అధికారులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. పూడూరులో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వద్ద అడిషనల్ ఎస్పీ రవి

## పోలీసుల తనిఖీలు ముమ్మరం

పూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో సోమవారం అధికారులపై జరిగిన సంఘటన దృష్ట్యా మంగళవారం మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఎస్‌ఐ మధుసూదనరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైతులు, అధికారుల మధ్య జరిగిన ఘర్షణ దృష్ట్యా సమాచారంతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, మెతుకు ఆనందం, మహేష్‌రెడ్డి, శుభప్రద్ పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి లగచర్లకు వస్తున్నారన్న సమాచారంతో బారికేడ్లు వేసి వారిని అడ్డుకున్నారు. అనంతరం వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్‌కు తరలించారు.

# మొక్కుబడిగా ధాన్యం కొనుగోళ్లు

- యాచారం మండలం చింతపట్ల, నందివనపర్తి కొనుగోలు కేంద్రాలకు చేరిన 70 క్వింటాళ్ల వడ్లు
- అధికారుల నిర్లక్ష్యంతో దళారీలకు విక్రయిస్తున్న రైతులు


నందివనపర్తిలోని కొనుగోలు కేంద్రంలో విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యం

యాచారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాచారం, చింతపట్ల, నందివనపర్తి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. రెండు కేంద్రాలకు సోమవారం సాయంత్రం నాటికి 70 క్వింటాళ్ల ధాన్యం చేరింది. యాచారం మండల కేంద్రంలో మంగళవారం కొనుగోలు కేంద్రం తెరిచారు. వివిధ గ్రామాలకు చెందిన దళారీలు నేరుగా రైతుల పంట పొలాలకు చేరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మండలంలో గత మూడు వారాల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే, అంతకుముందే కొనుగోలు కేంద్రాలను తెరవాల్సి ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో వడ్లు దళారీలు కొనుగోలు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లయింది. వారు క్వింటాల్‌కు రూ.2,400 ధర చెల్లిస్తుండడంతో రైతులు అప్పగిస్తున్నారు. కాగా, ప్రభుత్వం క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,300లకు కొనుగోలు చేస్తోంది. దళారీలు రూ.100 అధికంగా ఇస్తుండడంతో రైతులు వారి వైపు మొగ్గుచూపుతున్నారు. వారం రోజుల క్రితం నందివనపర్తి, చింతపట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడమే కానీ, గింజ వడ్లు అమ్మకానికి రాలేదు. కొంత మంది దళారీలు పంట వేసే సమయంలో రైతులకు అప్పులు ఇస్తున్నారు. పంట చేతికొచ్చాక ధాన్యాన్ని కొంటున్నట్లు పలువురు రైతులు తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే అధికారులు ఇబ్బంది పెట్టడంతో దళారీలకు విక్రయించకతప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే దాదాపు 80శాతం ధాన్యం దళారీలు కొనుగోలు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ రైతులను కోరుతున్నారు.


అంజయ్య యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అమీన్‌పీర్ దర్గా సభ్యులుత

## కడప పెద్ద దర్గా ఉర్సుకు రావాలని ఆహ్వానం

కేశంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కడప అమీన్‌పీర్ సాహెబ్ పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఎండీ నవాజ్, అమీన్‌పీర్ దర్గాసభ్యులు సాధక్, బురాన్‌లు కలిసి ఆహ్వానించారు. మంగళవారం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారు ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 16 నుంచి 20 వరకు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ వేడుకలకు తప్పక హాజరుకావాలని కోరారు.

## 'మైసిగండి మైసమ్మ' పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన మైసిగండి మైసమ్మ దేవాలయానికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కడ్తాల మండల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. మంగళవారం పలు సమావేశాలలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌ల ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. కమిటీలో మండలానికి చెందినవారికి అవకాశం కల్పించాలని కోరారు. జహంగీర్‌అలీ, సత్యంయాదవ్, మాలే మల్లేశ్‌గౌడ్, యాదయ్య గౌడ్, సుధాకర్‌గౌడ్, మోత్యానాయక్, వెంకటయ్య, శేఖర్, రమేశ్, రాజేందర్, శ్రీను, శ్రీకాంత్, జంగయ్య, శ్రీశైలం, తదితరులున్నారు.

# సమగ్ర సర్వేకు సహకరించాలి : డీపీవో

- విధులకు గైర్హాజరైన కార్యదర్శికి షోకాజ్ నోటీస్


మహేశ్వరం : అమీర్‌పేటలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి

ఇబ్రహీంపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని డీపీవో సురేశ్ మోహన్ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఉప్పరిగూడను సందర్శించి సర్వే తీరును పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఎన్యుమరేటర్లు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కార్యదర్శి రిషికకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

### సర్వేను సమగ్రంగా చేపట్టాలి

ఆమనగల్లు : కులగణన సర్వేను సమగ్రంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి సర్వేఫారాలను భద్రపరిచిన ట్రంక్ బాక్స్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో కమిషనర్ వసంత పరిశీలించారు.

### అన్ని వివరాలు సేకరించాలి

షాద్‌నగర్ : సర్వేను సమగ్రంగా నిర్వహించాలని, ప్రజల నుంచి అన్ని వివరాలు సేకరించి పొందుపర్చాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సర్వే నిర్వాహకులను ఆదేశించారు. ఎన్యూమరేటర్లు షాద్‌నగర్ పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను ఎమ్మెల్యే సర్వే సిబ్బందికి తెలియజేశారు. ప్రభుత్వం చేపట్టిన సర్వే వల్ల ఎంతోమంది పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. మొక్కుబడిగా కాకుండా సర్వేలో పొందుపర్చిన అంశాల గురించి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### సర్వేలో పొరపాట్లకు తావివ్వకూడదు

మహేశ్వరం : సమగ్ర సర్వేలో అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని వివరాలతో కూడిన సమాచారాన్ని రిపోర్టులో నమోదు చేసుకోవాలని మహేశ్వరం మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలోని అమీర్‌పేటలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. సర్వేకోసం వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కులగణ సర్వే ఏ ప్రాతిపదికన చేస్తున్నారు?

కందుకూరు : కులగణన సర్వేను ఏ ప్రాతిపాదికన చేస్తున్నారని ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగర్‌మియాగూడలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని మాట్లాడారు. కులగణన ఎలా చేస్తున్నారని అడుగగా.. ఆధార్, రేషన్‌కార్డు, భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. ఆ వివరాలు చెప్పడం వల్ల రేషన్‌కార్డులు తొలగించడానికి ఆస్కారం ఉంటుందని సబితా ఇంద్రారెడ్డి అధికారులును అడుగగా, తమకు పూర్తి సమాచారం ప్రజలు ఇవ్వడం లేదని, వారు తెలిపిన వివరాలను మాత్రమే సేకరిస్తున్నట్లు సబితాఇంద్రారెడ్డి వివరించారు.

### ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి?

కేశంపేట : ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. పొరపాట్లు లేకుండా అన్ని వివరాలను సమగ్రంగ నమోదు చేయాలని ఎన్యూమరేటర్ల సూచించారు. అలాగే సర్వే రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున సెంటర్‌ను పరిశీలించారు. తప్పులు లేకుండ కంప్యూరీకరణ చేయాలని తెలిపారు. పత్రాలను స్ట్రాంగ్ రూములలో భద్రపరచాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శంషాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి పెద్దషాపూర్ గ్రామ పరిధిలో గల ఎన్‌హెచ్ 44 రోడ్డుపై శంషాబాద్ వైపు వెళ్లే దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న శంషాబాద్ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి (50-55), ప్రమాదంలో శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడు పెద్దషాపూర్ గ్రామ పరిధిలో రోడ్డు దాటుతుండగా షాద్‌నగర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై ముదురు నీలిరంగు షర్టుతో పాటు తెల్లటి గడ్డం, తల వెంట్రుకలున్నాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

### కొర్రతండాలో కిరాణషాపు దగ్ధం

మాడ్గుల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రతండాలో ఓ కిరాణషాపు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంగళవారం ఉదయం కొర్ర సేవ్యా తన షాపులో వస్తువులను విక్రయించి మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం షాపులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫర్నిచర్, ఫ్రిడ్జ్, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.లక్షా 50వేల నష్టం వాటిల్లినట్లు సేవ్యా తెలిపాడు. కాగా, ప్రభుత్వం బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని మండల గిరిజన నాయకుడు కొర్ర బాల్‌నాయక్ కోరారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులందిస్తాం


కొత్తూర్ : రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి త్వరలోనే రేషన్‌కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని బండోనిగూడ, బుగ్గోనిగూడలో రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులు బస్సు సౌకర్యం కల్పించాలని శంకర్‌ను కోరారు. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలు, నాయకులు పసుల బుచ్చయ్య, సాలయ్య, బుగ్గ నర్సింలు, కొమ్ము కృష్ణ, జిల్లెల్ల బాల్‌రెడ్డి, బండ మల్లేష్, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి క్రిష్ణ, మంకాల శ్రీశైలం, శివ, నవీన్‌గౌడ్, రాజు, జెట్ట శ్రీశైలం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

కొత్తూర్ : నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. సిద్దాపూర్ గ్రామపంచాయతీలోని చింతగట్టుతండా నుంచి పొల్కొనిగుట్టతండా వరకు రూ.92లక్షలతో నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, జంగయ్య, కొమ్ము కృష్ణ, లింగారం సురేష్‌గౌడ్, రాంచందర్‌నాయక్, గోపాల్‌నాయక్, రెడ్యానాయక్, హర్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

చౌదరిగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీపీ కార్మికులను దూషిస్తున్న జిల్లేడ్ చౌదరిగూడ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే శంకర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుద్దుల జంగయ్యతో కలిసి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జంగయ్య మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే గ్రామ పంచాయతీ కార్మికులే కారణమని, అలాంటి కార్మికులనే చౌదరిగూడ పంచాయతీ కార్యదర్శి పాండురంగంగౌడ్ మహిళలని చూడకుండా అసభ్యపదజాలంతో మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా, కార్యదర్శి కార్మికుల పట్ల అనుచిత మాటలు మాట్లాడటం సరైందికాదని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యే కార్మికులకు హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు వీరేష్, జంగయ్య, పాపయ్య, లక్ష్మమ్మ, పార్వతమ్మ, పెంటయ్య తదితరులున్నారు.

### 'అధికారులపై దాడి సరికాదు'

చేవెళ్ల/కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు రెవెన్యూ అధికారులపై దాడులు హేయమైన చర్య అని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ లగచర్లలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లగా దాడి చేయడం బాధాకరమన్నారు. ముందస్తు పథకం ప్రకారమే బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయించారని ఆరోపించారు. గతంలో చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం చందనవెల్లి, సీతారాంపూర్, హైతాబాద్ గ్రామాల్లో కంపెనీల ఏర్పాటుకు పూనుకొన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. రైతుల నుంచి తక్కువ ధరకు భూములు తీసుకొని ప్రైవేట్ కంపెనీలకు రూ.కోట్లకు అమ్ముకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు దుద్యాలలో పలువురిని రెచ్చగొట్టి పనిగట్టుకొని దాడులు చేశారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, దాడులతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతారని, ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, కలెక్టర్, రెవెన్యూ అధికారులపై రైతుల దాడి అమానుషమని, దాడిలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి పి.రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

### ఫార్మాసిటీ పేరుతో గిరిజనులకు అన్యాయం

చౌదరిగూడ : ఫార్మాసిటీ పేరుతో గిరిజనులకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని జిల్లేడ్ చౌదరిగూడ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్తఫా ఆరోపించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో నిరుపేదల భూములను గుంజుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, ప్రత్యేకాధికారిపై దాడికి పాల్పడిన లగచర్ల రోటిబండతండా, పులచర్లకుంట తండా, హకీంపేట్, పాలేపల్లి వాసులను పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేయడమేంటన్నారు.

### మధురై డీసీసీబీని సందర్శించిన 'చైర్మన్, డైరెక్టర్లు'

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మధురై డీసీసీబీ, పుండి పీఏసీఎస్‌ను మంగళవారం డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు గంప వెంకటేశ్, భూపాల్‌రావు, రంగారెడ్డిల ఆధ్వర్యంలోని బృందం సందర్శించింది. నాబార్డు ఆధ్వర్యంలో మధురైలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన డీసీసీబీ చైర్మన్లు, డైరెక్టర్లకు 2 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి శిక్షణలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, గంప వెంకటేశ్, డైరెక్టర్లు క్షేత్ర సందర్శనలో భాగంగా అక్కడి డీసీసీబీ, పీఏసీఎస్‌లను సందర్శించి రైతులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. జిల్లాలో కూడా బ్యాంకు సేవలను విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.


డీసీసీబీని సందర్శనలో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్

## బుగ్గజాతరలో ఏర్పాటుకు వీధిలైట్ల పంపిణీ



మంచాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు ఈనెల 15 నుంచి జరుగనున్నాయి. ఈమేరకు రమాదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 వీధిలైట్లను సమకూర్చారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం వీధిలైట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నేత కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మంకాల దాసు, రావుల బాష, దాసరమోని రమేష్, బుగ్గ రాములు, మార సురేష్, అంతటి రాజు, వెదిరె రమణా రెడ్డి, ఎన్నిదుల సురేష్, వెంకటేష్, కృష్ణ, భరత్‌రెడ్డి, వెదిరె సికిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలకు 'బెల్టు' కిక్కు

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ మొత్తంలో లాభాలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులతో ఎక్కువగా లాభాలు ఉండడంతో మద్యం వాపారులు వారికి అంతా తానై చూసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

### ఇష్టారీతిన బెల్టుషాపుల ఏర్పాటు

ఎక్కువ మొత్తంలో డబ్బులు ఆర్జించాలని భావిస్తున్న మద్యం వ్యాపారులు బెల్టుషాపులకు తెరతీశారు. వారి పరిధిలో బెల్టుషాపులను ప్రోత్సహించి పల్లెల్లో మద్యం అమ్మకాలకు తెరలేపారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో అనధికారంగా బెల్టుషాపులు ఏర్పాటై జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం వ్యాపారులు, ఎక్సైజ్, పోలీసులు, నాయకుల అండదండలతో బెల్టుషాపుల నిర్వాహకులు రెచ్చిపోతున్నట్లు ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### పల్లె జీవనంపై తీవ్ర ప్రభావం

గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేయడం ద్వారా పల్లె జీవనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. రోజంతా కష్టపడి పనిచేసిన సొమ్మంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారని మహిళలు వాపోతున్నారు. పలు గ్రామాల్లో బెల్టుషాపులకు వ్యతిరేకంగా మహిళలు, యువజన సంఘాలు బెల్టుషాపుల వద్ద నిరసన చేసిన సంఘటనలున్నాయి. అలాగే కొన్ని గ్రామపంచాయతీలు బెల్టుషాపులకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసినా ఫలితం శూన్యం. ప్రభుత్వం స్పందించి పల్లెల్లో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

### ఇంటి ముంగిటకే మద్యం

గ్రామాల్లో మద్యం ప్రియులకు బెల్టుషాపుల నిర్వాహకులు పోటాపోటీగా వారు ఉన్న చోటుకే మద్యాన్ని డెలివరీ చేస్తున్నారు. మద్యానికి తోడుగా ఫుడ్‌ను సైతం అందిస్తున్నారంటే ఎంతమేర లాభాలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎనీ టైం మందు అనే విధంగా బెల్టుషాపులు గ్రామాల్లో అందుబాటులో ఉంటున్నాయి. బెల్టుషాపుల నిర్వాకంతో యువత కూడా మద్యానికి బానిసలవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆరుట్ల ఎన్టీఆర్ కాలనీ వెల్ఫేర్ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభోత్సవంలో విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మంచాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆరుట్ల ఎన్టీఆర్ కాలనీలో వెల్ఫేర్ భవనాన్ని గ్రామానికి చెందిన మారగోని మానయ్య గౌడ్ రూ.2లక్షల సొంత నిధులతో నిర్మించారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వీఆర్‌వన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ యాదయ్య, పాండాల జంగయ్య, కావలి శ్రీనివాస్, గుడిమల్ల చంద్రయ్య, ఎల్లేష్, మార సురేష్, కృష్ణ, నాగరాజు, సికిందర్‌రెడ్డి, బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ సురేఖ అన్నారు. మంగళవారం మాచన్‌పల్లి తండాలో ఫౌండేషన్, షాద్‌నగర్ ఏబీవీ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 64 మందికి పైగా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, శిరిష, రమేష్, వైద్య సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపట్టిన షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం కేశంపేట మండలం సంగెం గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి లక్షా 11వేల రూపాయల విరాళం ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినయ్‌రెడ్డి చెక్కును అందజేశారు. సామాజిక బాధ్యతగా విరాళం ఇచ్చిన వినయ్‌రెడ్డిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, ఇబ్రహీం, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్, సుదర్శన్, సత్యంరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఓర్వలేని సబితా ఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అడ్డుపడుతోందని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్లలో స్కిల్స్ వర్సిటీ, ఇంటిగ్రేషన్ సిటీ, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నెలకొల్పడానికి కృతనిచ్చయంతో ఉన్నట్లు గుర్తుచేశారు. ఇలాంటి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కొత్తగా రోడ్డు, మెట్రో రైలు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు సంతోషంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎండి అఫ్జల్‌బేగ్, డిల్లీ శ్రీధర్, కంబల్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, ఎడ్ల కృష్ణ, జగదీష్ కురుమ, కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### ఆంజనేయస్వామికి పంచలోహ విగ్రహం బహూకరణ

**ఆమనగల్లు** : ఆమనగల్లు పట్టణ సమీపంలోని మాడ్గుల రోడ్డులో గల అంతిరింతిరి కొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి జంగారెడ్డి పల్లి గ్రామానికిచెందిన ఉప్పుల నర్సింహ్మ యాదవ్ దంపతులు పంచలోహ విగ్రహాన్ని సమకూర్చారు. మంగళవారం గ్రామ భజన బృందం సభ్యులు, నాయకులతో కలిసి ఆలయ నిర్వాహకులకు విగ్రహాన్ని అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. పంచలోహ విగ్రహాన్ని అందజేసిన నర్సింహయాదవ్ దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బు పరమేశ్‌గౌడ్, దుడ్డు ఆంజనేయులుయాదవ్, రామచంద్రయ్య, రవి, కొండల్, మల్లేశ్, మహేశ్, శ్రీశైలం, విజయ్, తదితరులున్నారు.

### 'సదర్'లో లాఠీచార్జిపై చర్యలు తీసుకోవాలి

**కేశంపేట** : షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సదర్ కార్యక్రమంలో సదర్ నిర్వాహకులు, యాదవ కుల పెద్దలపై లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేశంపేట మండలం చింతకుంటపల్లికి చెందిన అఖిత భారత యాదవ మహాసభ నాయకుడు పోచమోని రమేష్ మంగళవారం డిమాండ్ చేశారు. సామరస్యంగా జరుగుతున్న ఉత్సవంలో పోలీసులు అకారణంగా లాఠీచార్జి చేశారని తెలిపారు. నిర్వాహకులు, యాదవ కులపెద్దలు గాయపడ్డారని తెలిపారు.

### కొర్రతండాకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

మాడ్గుల : మండలంలోని కొర్రతండాలో కొన్ని సంవత్సరాల నుంచి లోవోల్టేజీ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని తండా వాసులు తెలిపారు. ఈ విషయం తండా నాయకులు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోగా.. వెంటనే స్పందించి 25కేవీఏ సింగల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డికి తండావాసులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.